# మేడిగడ్డ కుంగుబాటుపై అనుమానాలున్నాయి



బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టి కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

బరాజ్ పర్యటనకు తాము వెళ్లినపుడు 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయని, 28 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని మేడిగడ్డ బరాజ్ తట్టుకుని నిలబడిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు.

### కరెంటు ఖర్చా? రైతులకు నీళ్లా ?

ఎన్‌డీఎస్‌ఏ నివేదికను అడ్డంపెట్టుకొని నీటిని ఎత్తిపోయటం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోయటానికి ప్రభుత్వానికి అహం అడ్డువస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎల్లంపల్లి నుంచి నీరు ఎత్తిపోయటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 2 టీఎంసీలే ఎత్తిపోస్తే సరిపోదని, ఎల్లంపల్లిలో 16 టీఎంసీల నీళ్లు ఉన్నాయని చెప్పారు. 14 టీఎంసీల నీళ్లు హైదరాబాద్‌కు నిలువ ఉంచాలని, మరో 2 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేశాక ఆపే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎల్లంపల్లి నీళ్లు మిడ్ మానేరు, మిగతా రిజర్వాయర్లు నింపడానికి సరిపోవన్నారు. కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని లిఫ్ట్ చేయడం మినహా వేరే మార్గం లేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 40శాతం వర్షపాతం లోటు ఉందని, ఎన్నికలు లేనందున రాజకీయాలు చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కరువుకు ఇన్సూరెన్స్ అని అభివర్ణించారు. విద్యుత్ ఖర్చు ముఖ్యమా... రైతుకు నీళ్లు ఇవ్వటం ముఖ్యమా ? ఆయన ప్రశ్నించారు. గోదావరిలో 90 టీఎంసీల నీరు వృథాగా పోతున్నదని, ఆ నీరు శ్రీరాం సాగర్ ప్రాజెక్టుతో సమానమని గుర్తుచేశారు. భేషజాలకు పోకుండా కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వానికి హితవు పలికారు. బహుళ ప్రయోజనాలున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు డబ్బులవుతున్నాయని ప్రభుత్వం బాధ పడుతున్నదని, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు లక్షా 50 వేల కోట్లు అవుతుందని, అదెవరికి లాభం? అని ప్రశ్నించారు.

### బీజేపీ మాట ఉత్తమ్ నోట

కాంగ్రెస్, బీజేపీ ఏ విషయంలో విభేదించినా కాళేశ్వరంపై ఒకే వైఖరితో ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. బీజేపీ మాట మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నోట వెలువడినట్టే ఉందని ఆరోపించారు. ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు ఆధారంగా నడుచుకుంటామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పటంలో అర్థం అదేనన్నారు. కాళేశ్వరంపై కేంద్రం ఇచ్చింది ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు కాదని అది ఎన్డీయే రిపోర్ట్ అని ధ్వజమెత్తారు. పోలవరం కాఫర్‌డ్యామ్ కొట్టుకుపోయినపుడు ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు ఎక్కడ పోయిందని ప్రశ్నించారు.

### మెట్రోపై ఎంఐఎం ఒత్తిడి

మెట్రో అలైన్‌మెంట్‌ను ఎంఐఎం మార్చమని ఒత్తిడి చేయడం వల్లే పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు ముందుకు సాగలేదని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్షనేత మూడ్‌లోనే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎల్‌అండ్‌టీపై సీఎం అసెంబ్లీలో మాట్లాడిన తీరు బాగాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం వ్యాఖ్యలతో పెట్టుబడిదారులకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని అన్నారు. ముఖ్యమంత్రే అలా వ్యాఖ్యానిస్తే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని ఏ ముఖ్యమంత్రి అయినా క్యాన్సర్...ఎయిడ్స్‌తో పోలుస్తారా? ఇంతకన్నా మూర్ఖత్వం ఉంటుందా? అని ధ్వజమెత్తారు. హుస్సేన్ ఇ-షా-వలీ దర్గాపై తాము సుప్రీం కోర్టులో వేసిన అఫడవిట్ సరైందేనని సమర్థించారు. అందుకు భిన్నంగా సీఎం రేవంత్‌రెడ్డి వెళ్తారా అని ప్రశ్నించారు. మెట్రో ప్రాజెక్టులో రెయిల్ కారిడార్ ఉందని, భూ సేకరణలో ఇబ్బందులు ఉండవని ఎయిర్‌పోర్టుకు ఆ మార్గంలో మెట్రో ప్రతిపాదించామని చెప్పారు. తాము విజయవంతంగా అమలు చేస్తున్న ప్రాజెక్టులకు పేర్లు మార్చటం మినహా ఈ ప్రభుత్వం చేసింది ఏమిటని ప్రశ్నించారు. హైడ్రా పేరు మారిన పథకాల్లో ఒకటని పేర్కొన్నారు.

### సీఎం సోదరుల బండారం బయటపెడతాం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఏం చేస్తున్నారో తెలుసని కేటీఆర్ పేర్కొన్నారు. వారి బాగోతాలు అవసరమైనప్పుడు బయటపెడతామని హెచ్చరించారు. ఉదయసింహ, ఫహీమ్ ఖురేషి, అజిత్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి షాడో కేబినెట్ నడుపుతున్నారని ధ్వజమెత్తారు. ధరణి స్థానంలో ఏది వచ్చినా భూమేతే అవుతుందని విమర్శించారు.

### ప్రతీరోజూ తెలంగాణ భవన్‌లో...

అసెంబ్లీ సమావేశాల తరువాత తాను ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా తెలంగాణ భవన్‌లో అందుబాటులో ఉంటానని కేటీఆర్ వెల్లడించారు. ఈ ప్రభుత్వం ఐదేండ్లు పూర్తి చేయాలని కోరుకుంటున్నానని చెప్పారు. శ్వేతపత్రాలతో సీఎం రేవంత్‌రెడ్డి శోధించి సాధించేదీ ఏమీలేదన్నారు. ఉదయ్ స్కీంపై అంశాన్ని మోటర్లకు మీటర్లకు ఒప్పందంతో ముడిపెట్టి సీఎం సభను తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు.

## ఆగస్టు 2 తరువాత కాళేశ్వరం కార్యాచరణ

నీళ్లున్నప్పుడే ఖాళీ ప్రాజెక్టులు నింపిపెట్టాలని కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. బరాజ్ గేట్లు తెరిచి ఉన్నా నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చని ఇంజినీర్లు చెబుతున్నారని, సెప్టెంబర్‌లో నీళ్లు లిఫ్ట్ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు ఉన్నదని అది సరికాదన్నారు. కాళేశ్వరం నీటి విడుదల విషయంలో ఆగస్టు 2 వరకు ప్రభుత్వానికి డెడ్‌లైన్ పెట్టామని, అప్పటికీ విడుదల చేయకపోతే పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించి కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటి విడుదలపై కార్యాచరణ ప్రకటిస్తామని పునరుద్ఘాటించారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టు నిర్మించినా తాము సరిగా ప్రచారం చేసుకోలేకపోయామని, తాము చేసిన పనులను సరిగా చెప్పుకోలేకే ఎన్నికల్లో ఓడిపోయామని చెప్పారు.

## 13 మందికి అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా 13 మంది సివిల్ డీఎస్పీలకు అడిషనల్ ఎస్పీ(నాన్‌కేడర్)లుగా పదోన్నతులు కల్పిస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్ పొందిన 13 మంది 15రోజుల్లోపు డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో కే శంకర్(సీఐడీ), డీ ఉపేందర్(సీఐడీ), బీ ప్రతాప్‌కుమార్(విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్), బీ శ్రీకృష్ణగౌడ్(ఏసీబీ), జీ వెంకటేశ్వరబాబు(పీటీసీ అంబర్‌పేట్), జే నర్సయ్య(ఇంటెలిజెన్స్), ఎం పిచ్చయ్య(పీటీసీ అంబర్‌పేట్), ఏ విశ్వప్రసాద్(విజిలెన్స్), డీ కమలాకర్‌రెడ్డి(ఏసీబీ), బీ కిషన్(ఏసీపీ నిజామాబాద్ సీసీఎస్), ఎండీ మాజిద్(టీజీపీఏ), జీ బస్వారెడ్డి(ఏసీపీ ఆర్మూర్), కే పుల్లయ్య(ఏసీపీ సీఐసెల్ సైబరాబాద్) ఉన్నారు.

## నడిచి వెళ్తే 42.. వాహనంపై వెళ్తే 44 నిమిషాలు

### బెంగళూరులో ట్రాఫిక్ జామ్ దుస్థితి

బెంగళూరు, జూలై 27: మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తు వచ్చేది బెంగళూరు. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. ప్రపంచంలోనే అత్యంత దారుణమైన ట్రాఫిక్ సమస్య ఉన్న నగరాల్లో 2023లో బెంగళూరుకు రెండో స్థానం లభించింది. మీరు వాహనంలో ప్రయాణం చేయడం కన్నా నడిచి వెళ్లడమే మంచిదంటూ గూగుల్ మ్యాప్ కూడా అప్పుడప్పుడు నిర్ధారిస్తుంది. అలాంటి అంశంపైనే ఆయుష్ సింగ్ చేసిన ఒక పోస్టు ఇప్పుడు వైరల్ అవుతున్నది. బెంగళూరులోని బ్రిగేడ్ మెట్రోపోలీస్ నుంచి కేఆర్ పురం రైల్వే స్టేషన్‌కు ఆరు కిలోమీటర్ల దూరం. అయితే ఈ దూరాన్ని మీరు వాహనంలో చేరుకోవాలంటే 44 నిముషాలు, నడిచి వెళ్లాలంటే 42 నిముషాల సమయం పడుతుందని గూగుల్ మ్యాప్ చూపించే సందేశాన్ని అతడు ఎక్స్‌లో షేర్ చేస్తూ 'ఇది ఒక్క బెంగళూరులో మాత్రమే సంభవం' అని క్యాప్షన్ పెట్టాడు. ఈ పోస్టు వైరల్ కావడంతో 6.2 లక్షల మంది వీక్షించగా, పలువురు చమత్కారంగా కామెంట్లు పెట్టారు.


IHMI | MINISTRY OF TOURISM | NCHMCT

**INSTITUTE OF HOTEL MANAGEMENT**
**CATERING TECHNOLOGY & APPLIED NUTRITION**
(An autonomous body under Ministry of Tourism, Govt. of India)
"F" Row, D.D. Colony, Vidyanagar, Hyderabad, TG State. Ph: 040-27427569,
Mobile: 8374787988. E-mail: ihmhyd.principal@gmail.com, Web : www.ihmhyd.org

On behalf of National Council for Hotel Management and Catering Technology, Noida, IHM-Hyderabad calls for applications, from the eligible candidates to get admission into 2-Years of M.Sc.-HA (Hospitality Administration) program with the following eligibility criteria against the residual vacancies at IHM-Hyderabad which is an affiliated of NCHMCT :

1. Graduation in any discipline from a recognised University.
2. **There is No Age bar.**
3. The program is recognized by the Jawaharlal Nehru University, New Delhi to award the final degree.
4. Reservation as per government rules

Interested candidates must apply to the Institute by attaching the copies of testimonials latest by **03.08.2024** either in person/by post or vide email at **ihmhyd.principal@gmail.com** Admission form and other details are available on the website **www.ihmhyd.org** .
Admission helpline numbers: **8374787988** Name of contact person: **Mrs. Aruna/Mr.Prem Sagar**, Mobile number of contact person **9059440793**
Admission will be offered on the basis of a written test to be conducted by NCHMCT for residual vacancies to the eligible applicants. Candidates may follow institute website for information on the written test schedule.

**Sd/- Principal / Secretary.**


# 8 ఎంపీ సీట్లు ఇచ్చినా అదే వివక్ష?

- తెలంగాణపై మోదీది మొదటి నుంచి విద్వేషమే
- దేశంలో 20 మెట్రో ప్రాజెక్టులకు నిధుల వరద
- హైదరాబాద్ మెట్రోకు గుండు సున్నా: కేటీఆర్

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణపై ప్రధాని మోదీ మొదటి నుంచే మనసులో ద్వేషం నింపుకున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' అంటూనే తెలంగాణను దూరం పెడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణకు నిధులు మంజూరుచేయాలని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదని శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇతర రాష్ట్రాలపై ఎనలేని ప్రేమ ప్రదర్శించి తెలంగాణపై వివక్ష చూపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ మెట్రో కోసం నిధులు మంజూరుచేయాలని ఎన్నిసార్లు కోరినా పెడచెవినపెట్టారని మండిపడ్డారు. తాజా బడ్జెట్‌లోనూ మళ్లీ హైదరాబాద్ మెట్రోకు మొండి చెయ్యే చూపించారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ఆవిర్భావం నుంచే తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ మోదీ తన తెలంగాణ వ్యతిరేకత బయటపెట్టిన వైనాన్ని కేటీఆర్ గుర్తుచేశారు.

### 8 ఎంపీ సీట్లు ఇచ్చినా ఏం ఫాయిదా?

తెలంగాణ ప్రజలు బీజేపీకి ఎమినిది ఎంపీ స్థానాలు ఇచ్చినా రాష్ట్రానికి ఫాయిదా లేకుండా పోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో కన్నా రాష్ట్రానికి నిధుల్లో కోతలు పెట్టారన్నారని ఉదహరించారు. రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీకి 8 సీట్లు ఇచ్చింది రాష్ట్రంపై ఇలా వివక్షను మరింత చూపేందుకేనా? అని నిప్పులుచెరిగారు. గత పదేండ్లలో దేశంలోని 20 మెట్రో ప్రాజెక్ట్‌ల కోసం మోదీ ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు భారీగానే నిధులు కేటాయించిందని వివరించారు. తెలంగాణకు మాత్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. హైదరాబాద్ మెట్రో విషయంలో జరిగిన అన్యాయాన్ని మోదీకి వివరించి రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిధులు తేవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్ మెట్రోను విస్మరిస్తూ ఇతర రాష్ట్రాలకు కేటాయించిన నిధుల వివరాలను వెల్లడించారు.

**హైదరాబాద్‌ను విస్మరించిన కేంద్రం ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన నిధులు**

| రాష్ట్రం | ప్రాజెక్టుల సంఖ్య | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| ఉత్తరప్రదేశ్ | 4 | 5,134.99 |
| మహారాష్ట్ర | 3 | 4,109.00 |
| గుజరాత్ | 3 | 3,777.85 |
| ఢిల్లీ | 2 | 3,520.52 |
| కర్ణాటక | - | 1,880.14 |
| మధ్యప్రదేశ్ | 2 | 1,638.02 |
| బీహార్ | - | 1,400.75 |
| తమిళనాడు | - | 713.00 |
| కేరళ | 2 | 146.74 |

రాపిడ్‌రైల్ ప్రాజెక్ట్ (ఢిల్లీ-ఘజియాబాద్) 1,106.65




అశోక్ నగర్ వద్ద భిక్షాటన చేస్తున్న నిరుద్యోగి జనార్దన్

# నిరుద్యోగుల భిక్షాటన!

- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేస్తామని ప్రకటన
- భిక్షం వేసిన యువతి అరెస్టుకు పోలీసుల యత్నం

చిక్కడపల్లి, జూలై 27: కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ తెలంగాణ నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేస్తామని నిరుద్యోగ యువకులు ప్రకటించారు. పలువురు నిరుద్యోగులు శనివారం హైదరాబాద్ అశోక్‌నగర్, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్యను పెంచాలని, గ్రూప్ 1 మెయిన్స్‌లో 1:100 చొప్పున ఎంపిక చేయాలని నిరుద్యోగ నాయకుడు జనార్దన్ డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ ఇదే చిక్కడపల్లిలో విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పట్ల నిర్బంధం, అరెస్టులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని విజన్ ఐఏఎస్‌లో కూడా వారు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారికి భిక్షం వేసిన యువతిని అరెస్టు చేయడానికి పోలీసులు విఫలయత్నం చేశారు. తననెందుకు అరెస్టు చేస్తారని ఆ యువతి ప్రశ్నిస్తూ, ఎంతకూ రాకపోవడంతో పోలీసులు వెనుదిరిగి వెళ్లిపోయారు. అనంతరం భిక్షాటన చేస్తున్న నిరుద్యోగులను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అర్జున్, నర్సింహ, ఇందిరానాయక్ తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీలో ప్రకటనలకు టెండర్ల ఆహ్వానం

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) బస్టాండ్‌లలో వ్యాపార ప్రకటనలు ప్రదర్శించుకునేందుకు ఆసక్తికల్గిన సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించింది. రంగారెడ్డి, సికింద్రాబాద్, హైదరాబాద్, నల్లగొండ, ఆదిలాబాద్, జేబీఎస్, మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లలో వ్యాపార ప్రకటనలు ప్రదర్శించేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఆగస్టు 5 వరకు టెండర్ దరఖాస్తులను సమర్పించాలని టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది.






## ● 'ఆశ్రమ' టీచర్లకు పదోన్నతులు కల్పించాలి




ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆయా ఉపాధ్యాయులు శనివారం లక్డీకాపూల్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న 378 మంది పండిట్, పీఈటీలను, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే 610 మంది ఉపాధ్యాయులకు పీఆర్సీ సర్క్యూలర్‌తో ముడిపెట్టి పదోన్నతులను నిలిపివేశారని వాపోయారు. పాఠశాల ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేసి, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేసే వారికి పదోన్నతులు కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. – ఖైరతాబాద్